సాక్షి నిజామాబాద్

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



కొనసాగిన తనిఖీలు

తెయూ అనుబంధ గుర్తింపు కోసం డిగ్రీ, పీజీ కళాశాలల్లో నిర్వహిస్తున్న తనిఖీలు శుక్రవారం రెండోరోజు కొనసాగాయి.

- IIలో ▸



పాత పంచాయతీల్లోనే..

జిల్లాలో నూతన పంచాయతీలు ఏర్పడినా పాత జీపీల్లోనే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం

42.7 /26.8

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో పూర్తిచేశారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ నిర్వహించారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఓపీవోలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్ ద్వారా పోలింగ్ నిర్వహణపై మొదటి విడత శిక్షణ తరగతులు నిర్వహించామని, మే 1, 2వ తేదీల్లో రెండో విడత శిక్షణకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అబ్జర్వర్‌కు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఎన్ఐసీ అధికారి రవికుమార్, ఆర్డీవో రాజాగౌడ్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలని సీఎంకు లేఖ



నవీపేట: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ కార్డు లేఖ పంపినట్లు జెడ్పీ చైర్మన్, బోధన్ నియోజకవర్గ ఎలక్షన్ ఇన్‌చార్జి విఠల్ రావు తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ప్రకటించిన రూ. లక్షల రుణమాఫీ, రూ. 15వేల రైతు బంధు, రైతు బీమాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల అమలును ఎన్నిరోజుల్లో చేపడతారో ప్రకటించాలన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో లోపాలని సవరించి, అర్హులందరికీ ఉచిత కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌రావు, తెడ్డు పోశెట్టి, అబ్బన్న, అల్లం రమేశ్, సూరిబాబు, గంగాధర్, మోహీజ్, ఫకీరా పాల్గొన్నారు.

నేడో రేపో జిల్లా వైద్యశాఖ అధికారిపై విజిలెన్స్ విచారణ!

నిజామాబాద్ నాగారం: డీఎంహెచ్‌వో సుదర్శనం అక్రమాలపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టనున్నారు. రెండు మూడు రోజుల్లో ఎంక్వైరీ చేయనున్నట్లు సమాచారం. డీఎంహెచ్‌వోపై ఇటీవలే సమీర్ అనే వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డికి, ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. వైద్య ఆరోగ్యశాఖలో సర్వీస్ బుక్కులు మాయం చేయడం, పనులు పెండింగ్‌లో పెట్టడం, అద్దె వాహనాల గోల్‌మాల్‌పై ఫిర్యాదు చేయగా.. ఇప్పటికే ఉన్నతాధికారులు జిల్లాకు వచ్చి విచారించారు. నిజామాబాద్‌లో జరిగిన అక్రమాలు ఇతర జిల్లాల్లో జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రాష్ట్రంలోని ఇతర జిల్లాల శాఖ కార్యాలయాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు.

17,04,867 ఓటర్లు మంది



- నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో తేలిన ఓటర్ల లెక్క
- ఓటరు జాబితా విడుదల చేసిన రిటర్నింగ్ అధికారి

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్ల లెక్క తేలింది. ఇందుకు సంబంధించిన జాబితాను అధికారులు విడుదల చేశారు. మొత్తం 17,04,867 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల ఓటర్ల జాబితాను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం రాత్రి విడుదల చేశారు. ఫిబ్రవరి 8న నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ తుది జాబితాను ఎన్నికల అధికారులు ప్రకటించారు. అయితే మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు ఓటర్ల నమోదుకు అధికారులు మరో అవకాశం కల్పించారు. అధికారులు ఓటర్ల నమోదు కోసం చేస్తున్న దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి కసరత్తు చేశారు. శుక్రవారం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఓటర్ల జాబితాను ప్రకటించారు. ఈ జాబితా ఆధారంగా నియోజకవర్గంలో మొత్తం 1,808 పోలింగ్ కేంద్రాలుండగా 17,04,867 ఓటర్లు ఉన్నారు. అందులో 8,06,130 మంది పురుష ఓటర్లు కాగా, 8,98,647 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మరో 90 మంది ఇతరులు ఉన్నారు. కాగా తుది ఓటర్ల జాబితాతో పోలిస్తే 3,294 మంది ఓటర్లు నూతనంగా నమోదు చేసుకున్నారు. నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళల ఓట్లు 92,517 అధికంగా ఉన్నాయి. కాగా ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడింది. అప్పటి నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 26న స్క్రూటినీ పూర్తి చేశారు. 29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. మే 13న ఎన్నికలు నిర్వహించనున్నారు. జూన్ 4న ఫలితాలు వెలువడతాయి.

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆర్మూర్	217	98,737	1,13,401	7	2,12,145
బోధన్	246	1,06,372	1,16,719	5	2,23,096
నిజామాబాద్‌అర్బన్	289	1,46,757	1,57,519	41	3,04,317
నిజామాబాద్ రూరల్	293	1,19,769	1,36,818	6	2,56,593
బాల్కొండ	247	1,04,721	1,22,068	3	2,26,792
కోరుట్ల	262	1,16,382	1,28,863	4	2,45,249
జగిత్యాల	254	1,13,392	1,23,259	24	2,36,675
మొత్తం	1808	8,06,130	8,98,647	90	1,70,4867

పది మంది నామినేషన్ల తిరస్కరణ



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఎన్నికల పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్

- 32 మంది నామినేషన్ల చెల్లుబాటు
- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ స్థానానికి దాఖలైన నామినేషన్లను శుక్రవారం స్క్రూటినీ చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్ సమక్షంలో పరిశీలన కొనసాగింది. ఈ సందర్భంగా 10 మంది అభ్యర్థులు సమర్పించిన అన్ని సెట్ల నామినేషన్లు వివిధ కారణాల వల్ల తిరస్కరణకు గురయ్యాయని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. మొత్తం 42 మంది అభ్యర్థులు 90 నామినేషన్లు వేయగా చేయగా, స్క్రూటినీలో 10 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించామని తెలిపారు. 32 మంది అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే చెల్లుబాటు అయ్యాయన్నారు. నామినేషన్లు తిరస్కరణకు గురైన వాటిలో మిర్యాల్‌కర్ జయప్రకాశ్, పోతు అశోక్, మహమ్మద్ జమీల్, ఎండీ షాహెద్ ఖాన్, కొండూరు గంగాధర్, పానుగంటి రజితావాణి, చెంచుల అశోక్, బేగరి పోశం, మీసాల శ్రీనివాస్‌రావు, వి మహాతేజ ఉన్నారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

కాగా నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉంది. ఆ తర్వాత బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితా ప్రకటించి, అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నారు. ఆ తర్వాత ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర, ఇతర పార్టీల అభ్యర్థుల ప్రచారం హోరెత్తనుంది.

జహీరాబాద్‌లో 18 నామినేషన్లు..

కామారెడ్డి క్రైం: జహీరాబాద్ లోక్‌సభ స్థానంలో దాఖలైన నామినేషన్లను శుక్రవారం పరిశీలించారు. 14 మంది అభ్యర్థులకు సంబంధించిన 18 నామినేషన్లను తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించిన విషయం తెలిసిందే. మొత్తం 40 మంది అభ్యర్థులు 68 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. శుక్రవారం సంగారెడ్డిలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జహీరాబాద్ పార్లమెంట్ సాధారణ ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జి తివారి సమక్షంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించారు. నిబంధనల ప్రకా రం లేని 18 నామినేషన్లను తిరస్కరించారు. ఈనెల 29 వరకు ఉపసంహరణకు గడువు ఉంది. పరిశీలన కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైయినీ ఐఏఎస్ మనోజ్, అభ్యర్థులు పాల్గొన్నారు.

కుళ్లిన కూరగాయలతో వంట చేస్తున్నారు



ఎన్టీఆర్ చౌరస్తాలో కూరగాయలతో నిరసన తెలుపుతున్న ఎస్టీ హాస్టల్ విద్యార్థులు

- ఎస్టీ హాస్టల్ విద్యార్థుల ఆరోపణ
- ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన
- భారీగా ట్రాఫిక్ జాం

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని నాందేవ్‌వాడ ఎస్టీ హాస్టల్‌లో కుళ్లిన కూరగాయలతో భోజనాలు పెడుతున్నారని హాస్టల్ విద్యార్థులు శుక్రవారం ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. కూరగాయలు, సిలిండర్, ఇతర వస్తువులతో రోడ్డుపై బైఠాయించారు. కలెక్టర్ వచ్చి సమస్యను తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు రెండు గంటల పాటు నిరసన తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆందోళన విరమించాలని విద్యార్థులకు సూచించినా వినలేదు. హాస్టల్ వార్డెన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీలు, సీఐలు ఆందోళన విరమించే ప్రయత్నం చేసినా వినలేదు. వాహనాలకు అడ్డుపడ్డారు. సమాచారం తెలుసుకున్న సీపీ కల్మేశ్వర్ ఘటనా స్థలానికి వచ్చారు. పోలీసులు విద్యార్థులను చెదరగొట్టి కొందరిని అరెస్టు చేసి 1వ టౌన్, 4వ టౌన్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. గంటల తరబడి ఆందోళన చేపట్టడంతో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

హాస్టల్ వార్డెన్ తొలగింపు

ఎస్టీ హాస్టల్ వార్డెన్ సత్యంను విధుల నుంచి తొలగించినట్లు జిల్లా ఎస్టీ వెల్ఫేర్ ఆఫీసర్ నాగోరావు తెలిపారు. ఆయన స్థానంలో జీవన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించామన్నారు. సత్యంపై విచారణ చేపడతామని.. నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

గట్టెక్కిన పంటలు..

- ఆపద కాలంలో ఆదుకున్న ఎత్తిపోతల పథకాలు
- పొట్టదశలో వరికి ప్రాణం పోసిన లిఫ్టులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): భూగర్భ జలాలు ఈ ఏడాది భారీగా తగ్గిపోవడంతో చాలా ప్రాంతాల్లో వ్యవసాయ బోర్లకు నీరందలేదు. మోటార్లకు నీరందక వట్టిపోయిన పరిస్థితులను చూశాం. దీంతో బోర్ల కింద రైతులు సాగుచేసిన యాసంగి పంటలు ఎండే పరిస్థితికి వచ్చాయి. అయితే, డొంకేశ్వర్ మండలంలో కూడా పలు గ్రామాల్లో వ్యవసాయ బోర్లు వట్టిపోయాయి. అయితే, పొట్ట దశలో ఉన్న వరికి స్థానికంగా ఉన్న ఎత్తిపోతల పథకాలు ప్రాణం పోశాయి. వేల ఎకరాల పొలాలు గండం నుంచి గట్టెక్కాయి. దీంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డొంకేశ్వర్‌లో మండలంలో ఉన్న లిఫ్టులు ఆపద కాలంలో నీరందించి వివిధ రకాల పంటలను ఈ విధంగా ఆదుకుంటున్నాయి. నికాల్‌పూర్, డొంకేశ్వర్, మారంపల్లి, గాదేపల్లి, దత్తాపూర్ లిఫ్టులున్నాయి. ఈ ఐదు లిఫ్టుల కింద మొత్తం 13 గ్రామాలు ఉండగా దాదాపు 9వేల ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. సింహభాగం రైతులు వరిని సాగు చేస్తుండగా, మక్కలు, జొన్నలు, సోయా, పసుపు, సజ్జ, నువ్వు, ఇతర కూరగాయల పంటలు సైతం ఎత్తిపోతల నీటితోనే సాగు చేస్తున్నారు. గోదావరి నది కూడా మండల పరిధిలోని గ్రామాలకు ఆనుకుని ఉండడంతో బోర్లు లేని రైతులు లిఫ్టులు ఉన్నాయనే ధీమాతో పంటలను సాగు చేస్తున్నారు. యాసంగిలో బోర్లు కింద సాగు చేసిన రైతులు కూడా వారి బోర్లు వట్టిపోవడంతో లిఫ్టుల నీళ్లే ఆధారమయ్యాయి. ఎత్తిపోతల పథకాలు లేకుంటే తమ పంటలు చేతికి వచ్చేవికాదని అంటున్నారు.



ఆయకట్టు కింద సాగవుతున్న వరి

డొంకేశ్వర్ మండలంలో లిఫ్టుల కింద ఆయకట్టు (ఎకరాల్లో)

నికాల్‌పూర్	2,500
మారంపల్లి	2,500
డొంకేశ్వర్	2,400
గాదేపల్లి	1,000
దత్తాపూర్	1,100

లిఫ్ట్ లేకపోతే పొలం ఎండిపోయేది



యాసంగిలో ఎనిమిది ఎకరాల్లో పొలం వేశాను. రెండు వ్యవసాయ బోర్లు పని చేయ లేదు. పొట్ట దశలో ఉన్న వరి పంట ఎత్తిపోతల నీటితోనే గట్టెక్కింది. ఒకవేళ లిఫ్ట్ లేకపోయి ఉండే నా పొలం మొత్తం ఎండిపోయేది. నికాల్‌పూర్ లిఫ్ట్ దయతోనే పంట చేతికి వచ్చింది. – బొగ్గుల రవి, రైతు, నికాల్‌పూర్

ఎత్తిపోతలు వరంతో సమానం



నికాల్‌పూర్ ఎత్తిపోతల పథకం మాకు వరంతో సమానం. ఎందుకంటే కష్టకాలంలో కూడా పంటలకు సాగునీటికి ఢోకా లేదు. వ్యవసాయ బోర్లు ఎత్తిపోతే లిఫ్ట్ పరిధిలోని గ్రామాలకు చివరి ఆయకట్టు వరకు నీటిని అందించాం. తద్వారా పంటలు గట్టెక్కాయి. రైతులు సంతోషంగా ఉన్నారు. – జిలకరి చిన్నయ్య, లిఫ్ట్ చైర్మన్, నికాల్‌పూర్

జీజీహెచ్ ప్రాథమిక చికిత్సకేనా..!

- అత్యాధునిక పరికరాలున్నా అందని మెరుగైన వైద్యం
- ప్రైవేటుకు రోగులను రిఫర్ చేయడం వెనుక ఆంతర్యమేమిటో..!

నిజామాబాద్‌నాగారం: జీజీహెచ్.. పేరుకే పెద్దాస్పత్రి. ఆస్పత్రిలో అత్యాధునిక పరికాలు ఉన్నా.. మెరుగైన వైద్య చికిత్సలు మాత్రం అందడంలేదు. ఉత్తమ వైద్య సేవలు అందించే అవకాశం ఉన్నా.. కొందరు వైద్యులు ప్రాథమిక వైద్య సేవలు చేసి రోగులను తమ ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. రూ. కోట్ల విలువ చేసే పరికరాలు, సర్జరీ చేసే వైద్యులు అందుబాటులో ఉన్నా ప్రైవేటుకు తరలించడం వెనుక ఆంతర్యమేమిటో తెలియాల్సి ఉంది.

హడావుడి కోసమే..

జిల్లాలో ఎక్కడైనా ప్రమాదాలు జరిగినా, ఫుడ్ పాయిజన్ లాంటి ఘటనలు జరిగితే ముందుగా జీజీహెచ్ తరలిస్తున్నారు. కానీ ఇక్కడి సరైన వైద్య సేవలు అందడం లేదు. గురువారం రాత్రి సమయంలో నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ శివారులో డీసీఎం వ్యాన్ బోల్తా పడింది. ఇందులో 36 మంది గాయపడగా ఇద్దరు మరణించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కాగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన చికిత్స పేరుతో కొంత మందిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఒకే ప్రైవేటు ఆస్పత్రికి ఆరుగురు రోగులను రిఫర్ చేశారు. సదరు ఆస్పత్రి జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ వైద్యుడికి సంబంధించినది కావడంతో అనుమానాలకు బలం చేకూరుతోంది.

పలువురి పరామర్శ

వ్యాన్ బోల్తా ప్రమాదంలో 36 మంది గాయపడగా ఇందులో 15 మందిని రాత్రికి ప్రైవేటుకు తరలించారు. ఐదుగురు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిలు పరామర్శించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సైతం పరామర్శించారు.

రూ. కోట్ల విలువ చేసే పరికరాలున్నా..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సదుపాయాలు, పరికరాలు ఉన్నాయి. పెద్ద సర్జరీలు చేసే వైద్యులున్నారు. అత్యవసర సమయంలో రోగులకు మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంది. కానీ ప్రాథమిక చికిత్స అందించి మమ అనిపిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ. కోట్ల విలువ చేసే పరికరాలున్నా.. మంచి వైద్యులున్నా.. ప్రాథమిక చికిత్స అందించి రిఫర్ చేస్తుండడం గమనార్హం. కొంతమంది వైద్యులు రోగులను తమకు సంబంధించిన ఆస్పత్రికి తరలిస్తున్నారు.

కమీషన్ల కోసమే రిఫర్

జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో కొంత మందిని మెరుగైన చికిత్స పేరిట ప్రైవేటు ఆస్పత్రులకు రోగులను రిఫర్ చేసుకున్నారు. కొంత మంది వైద్యులు తమ ఆస్పత్రులకు పేషెంట్లను రిఫర్ చేసుకుంటున్నా అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
– సయ్యద్‌ఖైసర్, కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు

ప్రైవేటుకు పంపడం సరికాదు

వ్యాన్ బోల్తా ప్రమాదంలో గాయపడిన వారిని జీజీహెచ్‌కు 108లో తీసుకువచ్చారు. ఇక్కడే చికిత్స అందించి మళ్లీ అర్ధరాత్రి ప్రైవేటుకు ఎందుకు తరలించారు. పరికరాలు, వైద్యులున్నా ప్రైవేటుకు తరలించడం సరికాదు. ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దు.
– మునిపల్లి సాయిరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్

బీసీల రిజర్వేషన్‌కు బీజేపీ వ్యతిరేకం

- కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి



ఖలీల్‌వాడి: బీసీల రిజర్వేషన్‌లకు బీజేపీ వ్యతిరేకమని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆరోపించారు. నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో గల మున్నూరు కాపు కల్యాణ మండపంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ధనిక వర్గాలకు బీజేపీ మద్దతు పలుకుతుందని విమర్శించారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే ఏడాదిలోపు 30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. కేంద్రంలో ఇచ్చే 27 శాతం ఓబీసీ రిజర్వేషన్‌ను 40 శాతానికి పెంచుతామన్నారు. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తామని, కూలీలకు రూ.300 అందేలా చూస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ ఆధ్వర్యంలో వైఆర్ డేవిడ్‌తోపాటు పలువురు క్రైస్తవులు కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సేవలు విస్తృతం చేస్తాం



వాకర్స్‌తో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్

- ముంబయి, అయోధ్య, ఢిల్లీకి ఎక్కువ రైళ్లు నడిపిస్తాం
- అర్బన్‌లో ఓటింగ్ శాతం పెరగాల్సిన అవసరముంది
- ఎంపీ ధర్మపురి అర్వింద్

సుభాష్‌నగర్: నిజామాబాద్ నుంచి రాబోయే రోజుల్లో రైల్వేసేవలను మరింత విస్తృతం చేస్తామని, ముంబయి, అయోధ్య, ఢిల్లీకి ఎక్కువ రైళ్లు నడిపిస్తామని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో చాయ్ పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెరగాల్సిన అవసరముందన్నారు. యువత ఎక్కడ ఉన్నా.. పోలింగ్ రోజు ఓటు వేయాలని కోరారు. దేశంలో అభివృద్ధి జరిగినా.. సంక్షేమ పథకాలు అమల్జేస్తున్నా.. ఒక వర్గం వారు ఆలోచన లేకుండా ఒకే పార్టీకి ఓట్లేస్తున్నారని పేర్కొన్నారు. ఐదేళ్లలో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వే ఓవర్ బ్రిడ్జీలు నిర్మించామని, రెండు కేవీలు తీసుకొచ్చామని గుర్తుచేశారు. జిల్లాకు సైనిక్ స్కూల్ తీసుకొస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్‌కు ఓట్లేస్తే వృథాగా పోతాయన్నారు. తనను గెలిపించాలని కోరారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, నాయకులు న్యాలం రాజు, పంచరెడ్డి లింగం, సుక్క మధు, బైకన్ మధు, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, దొంతుల రవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆత్మీయ సమ్మేళనం



భీమ్‌గల్: పట్టణంలోని శ్రీభారతి విద్యాలయ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు సుమారు 20 ఏళ్ల తరువాత ఒకే వేదికపైకి చేరుకున్నారు. శుక్రవారం నిర్వహించిన ఆత్మీయసమ్మేళనం పాతజ్ఞాపకాలకు వేదికైంది. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన అనుబంధ గుర్తింపు తనిఖీలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను వర్సిటీ అనుబంధ గుర్తింపు కోసం డిగ్రీ, పీజీ కళాశాలల్లో నిర్వహిస్తున్న తనిఖీలు శుక్రవారం రెండోరోజు కొనసాగాయి. ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ నేతృత్వంలో జిల్లాలోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ, గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజీ, నలంద, గౌతమి, టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ, వుమెన్స్ డిగ్రీ కాలేజీ, కేర్, ఏహెచ్ఎంవీ, వాగ్దేవి, ప్రగతి, జునైరా డిగ్రీ కాలేజీల్లో తనిఖీలు నిర్వహించారు. యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, యూనివర్సిటీ నిర్దేశించిన నిబంధనల మేరకు వసతి సౌకర్యాలు ఉన్నాయా లేవా అనే అంశాలను పరిశీలించారు. సొంత భవనాలు, తగినన్ని తరగతి గదులు, క్రీడా మైదానం లేని కళాశాలల వారికి నోటీసులు అందజేసినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. తనిఖీల్లో ఆడిట్‌సెల్ జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ ఘోరీ, డీన్స్ రాంబాబు, అపర్ణ, ఆరతి, లావ ణ్య, మేనేజ్‌మెంట్ విభాగం హెడ్ ఆంజనేయులు, కంప్యూటర్ సైన్స్ హెడ్ అంబిక పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర సరిహద్దులో పటిష్ట నిఘా

బోధన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అంతరాష్ట్ర, జిల్లా సరిహద్దు మీదుగా అక్రమంగా మద్యం, డబ్బుల రవాణా నియంత్రణకు పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ తెలిపారు. శుక్రవారం సాలూర అంత రాష్ట్ర చెక్ పోస్టు ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రమేశ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మోదీ పాలనలో మహిళలకు సంక్షేమ పథకాలు

- ఎస్‌హెచ్‌జీ రుణాల్లో కేంద్రం సబ్సిడీ 5శాతం
- బీజేపీ అభ్యర్థి, ఎంపీ ధర్మపురి అర్వింద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

సుభాష్‌నగర్: నరేంద్రమోదీ నేతృత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల మహిళల సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్నదని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. నగరశివారులోని శ్రీరామ గార్డెన్‌లో శుక్రవారం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మహిళా మోర్చా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్వింద్ మాట్లాడుతూ.. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు రూ.6382 కోట్ల రుణాలను అందాయని, అందులో వడ్డీ మాఫీ కింద కేంద్రం 5శాతం భరిస్తోందని తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మిగతా 4శాతం చెల్లించకపోవడంతో మహిళలపై వడ్డీభారం పడుతోందని అన్నారు. అలాగే ముద్రరుణాల కింద నియోజకవర్గంలో రూ.2450 కోట్లు ఇచ్చామని, వీటితోపాటు మహిళల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి కేంద్రం అనేక పథకాలు అమలు చేస్తున్నదన్నారు. ముఖ్యంగా ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన, ఉచితరేషన్ తదితర పథకాలు అన్నివర్గాల కోసం ప్రధాని మోదీ అమలుచేస్తున్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. కాంగ్రెస్ మాత్రం కేవలం ఒక వర్గం ప్రజల కోసమే పని చేస్తుందని ఆరోపించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో మహిళల ఓట్లే కీలకమని, అందరూ మోదీపై ఉన్న అభిమానంతో బీజేపీకి ఓటేసి గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మహిళలు ప్రమాదంలో పడటం ఖాయమని అన్నారు. మైనార్టీ మహిళల ఆత్మగౌరవం కోసం ట్రిపుల్ తలాక్ రద్దు కొనసాగుతుందన్నారు. అంతకుముందు అర్బన్ నియోజకవర్గం నుంచి మహిళలు పెద్దసంఖ్యలో అర్వింద్ సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గోపిడి స్రవంతిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షుడు పంచరెడ్డి ప్రవళిక, సీనియర్ నాయకులు గీతారెడ్డి, బోగ శ్రావణి, కల్పనాఠాకూర్, కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాత పంచాయతీల్లోనే పోలింగ్

- కొత్త పంచాయతీల్లో ఏర్పాటు కాని పోలింగ్ బూత్‌లు



ఏర్గట్ల మండలం నాగేంద్రనగర్ జీపీ భవనం

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్ పంచాయతీ పరిధిలోని నాగేంద్రనగర్‌ను 2018లో ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ విభజన జరిగినా ఈ గ్రామంలోని ఓటర్లు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గుమ్మిర్యాల్‌లోనే ఓటు వేశారు. ఇప్పుడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ పాత గ్రామ పంచాయతీ పరిధిలోని పోలింగ్‌బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. నాగేంద్రనగర్‌లో 528 మంది ఓటర్లు ఉన్నారు. పంచాయతీ ఎన్నికల్లో మినహా ఇతర ఎన్నికల్లో వీరు పొరుగు గ్రామమైన గుమ్మిర్యాల్‌లోనే తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటై ఆరు సంవత్సరాలవుతున్నా ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం విన్నవించకపోవడంతో కొత్త పంచాయతీల్లో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో తొమ్మిది నియోజకవర్గాలు ఉండగా, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాన్ని మినహాయిస్తే ఎనిమిది నియోజకవర్గాల్లో కొత్త, పాత పంచాయతీలు కలిపి 1,056 ఉన్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో 1,701 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. రెండు జిల్లాల్లో నూతనంగా 340 గ్రామపంచాయతీలను ఏర్పాటు చేయగా, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పాత పంచాయతీలకు వెళ్లక తప్పనిపరిస్థితి నెలకొంది. పోలింగ్‌బూత్‌ల విభజన అంశం ఎన్నికల కమిషన్ పరిధిలో ఉండడం, నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటైన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లకపోవడంతో దీనికి కారణం.

వివాదాస్పద భూమి సర్వేకు నోటీసులు

- ఆలయ భూమి కబ్జా చేశారని గ్రామస్తుల ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని తల్వేద గ్రామంలో ఉన్న కాకయ్య ఆలయ భూమి అంశంపై గత కాలంగా వివాదం నెలకొంది. ఈనేపథ్యంలో ఈ నెల 29న సర్వే నిర్వహించి హద్దులు గుర్తించనున్నట్లు తహసీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి నోటీసులు సైతం జారీ చేశామన్నారు. తల్వేద గ్రామం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ముంపునకు గురికాగా.. పునరావసం కింద ఏర్పాటైన నూతన గ్రామంలో కాకయ్య మందిరం కోసం సీలింగ్ భూమిలో నుంచి ఎకరం కేటాయించి ఎండోమెంట్‌కు అప్పగించారు. అంతేకాకుండా గ్రామ కూడలిలోని దేవాలయానికి 2–11 ఇంటినంబర్‌ను కేటాయించారు. కాగా.. ఆలయ భూమిని కొందరు కబ్జా చేసి రికార్డుల్లో నుంచి మాయం చేశారని వీడీసీ సభ్యులు, గ్రామానికి చెందిన కొందరు యువకులు జిల్లా కలెక్టర్‌కు, జిల్లా పంచాయతీ అధికారితోపాటు స్థానిక ఎంపీడీవో, తహసీల్దార్‌లకు గతంలో ఫిర్యాదు చేశారు.

ఆయిల్‌పామ్‌తో మంచి లాభాలు

ఆర్మూర్‌టౌన్: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు మంచి లాభాలు ఆర్జించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి మధుసూదన్ అన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలోని నర్సరీతోపాటు పెర్కిట్‌లోని ఆయిల్‌పామ్ క్షేత్రాలను శుక్రవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. డ్రిప్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరపంటగా కూరగాయలు, కొన్ని రకాల పండ్ల తోటలను పెంచి అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. ఆయిల్‌పామ్ సబ్సిడీ డబ్బులు జూన్ చివరి వారం లేదా జూలై మొదటి వారంలో విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఆయనవెంట ఇంజినీర్ గంగామల్లయ్య, హెచ్ఈవో విద్యాసాగర్, ఫ్రీ యూనిక్ కంపెనీ నర్సరీ మేనేజర్ లోకేశ్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ నాల్గో సెమిస్టర్, ఐఎంబీఏ పదో సెమిస్టర్, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఒకటో సెమిస్టర్ పరీక్షలకు 355 మంది విద్యార్థులకుగాను 331 మంది హాజరుకాగా 24 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలి



విజేతలతో రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థుల వికాసానికి చదువుతో పాటు సమాజంపై అవగాహన ఉండాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి పేర్కొన్నారు. తెయూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీ సెమినార్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎన్ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమానికి రిజిస్ట్రార్ యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీలో నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై నిరంతరం ఉద్యమించడంతోపాటు క్రీడాపోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సోదరభావం పెంపొందుతుందన్నారు. ఆర్మూర్ ఎంపీపీ పస్క నర్సయ్య మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ఒక వ్యక్తి సమాజాన్ని దగ్గరగా పరిశీలించాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగం కావాలని, లౌకిక ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని సూచించారు. కార్యక్రమానికి వర్సిటీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం అధ్యక్షత వహించారు. వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, టూటా అధ్యక్షుడు పున్నయ్య, కాంట్రాక్ట్ అధ్యాపకులు దత్తహరి, శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ నేత, ఎన్ఎస్‌యూఐ నాయకులు సాగర్‌నాయక్, రాజేందర్, మహేశ్, శ్రీకాంత్, మంద నవీన్, కుశకుమార్, రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



నిజామాబాద్‌నాగారం: ఈనెల 18న మెదక్ జిల్లా మనోహరాబాద్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్ర జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపికలో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభకనబర్చి నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో ఎఫ్ఎస్ సిద్దార్థ (సత్యశోధక్ పాఠశాల, సిరికొండ), ఏ.తిరుపతి (మాదాపూర్), బాలికల విభాగంలో ఎస్.సౌమ్యారాణి (పందిమడుగు), జె.వైశాలి (అక్లూర్, భీమ్‌గల్), జి.సాత్విక, జి శ్రావిక, టి.నేహశ్రీ (సాంఘిక సంక్షేమ పాఠశాల, సుద్దపల్లి), ఎన్.వైశాలి (సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, ఆర్మూర్) ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ తెలిపారు. ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని తుంకూర్‌లో నిర్వహించనున్న 3వ జూనియర్ సౌత్‌జోన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని, శుక్రవారం జిల్లా కేంద్రం నుంచి బయల్దేరి వెళ్లారన్నారు. కార్యక్రమంలో జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, సత్యశోధక్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బి.సంతోష్ పాల్గొన్నారు.



గురి కుదిరినట్టేనా!

జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన చాయ్‌పే చర్చా కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో పలు అంశాలపై చర్చించారు. అక్కడ ఆర్చరీ సాధన చేస్తున్న ఓ క్రీడాకారుడి వద్దకు వెళ్లి ఇలా బాణం గురిపెట్టారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న వారు 'రెండో సారి విజయానికి గురి కుదిరినట్టేనా!' అని చర్చించుకున్నారు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

క్రైం కార్నర్

భర్తను గొంతునులిమి హత్య చేసిన భార్య



సాయిరెడ్డి (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ గ్రామానికి చెందిన లస్మయి సాయిరెడ్డి (52)ని అతడి భార్య లస్మయి రాధ గొంతునులిమి హత్య చేసింది. గురువారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సాయిరెడ్డికి రాధతో 30 ఏళ్ల క్రితం పెళ్లికాగా.. శృతి, జ్యోత్స్న, అక్షయ ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. వారికి గతంలోనే పెళ్లిళ్లయ్యాయి. పెద్ద కూతురు శృతి పదేళ్ల క్రితం తన భర్త నుంచి విడాకులు తీసుకుని తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. అప్పటి నుంచి సాయిరెడ్డి భార్య రాధతోపాటు కూతురు శృతిని మానసికంగా హింసిస్తూ కొడుతున్నాడు. దీంతో శృతి నెలరోజుల క్రితం కాలూరులోని ఆమె సోదరి ఇంటికి వెళ్లిపోయింది. ఈక్రమంలో గురువారం రాత్రి సాయిరెడ్డి హత్యకు గురయ్యాడు. శుక్రవారం ఉదయం సమాచారం అందుకున్న సీఐ సురేశ్, ఎస్సై గంగాధర్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టగా, భర్తను తానే గొంతు నులిమి హత్య చేసినట్లు రాధా ఒప్పుకుంది. మృతుడి సోదరి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా, సాయిరెడ్డి హత్యలో ఎంతమంది ప్రమేయం ఉందనే విషయమై పోలీసులు విచారణ చేపడుతున్నారు. తన భర్తను తానే హత్యచేసినట్లు రాధ ఒప్పుకున్నప్పటికీ ఇతరుల ప్రమేయం ఉందా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. హత్య జరిగిన సమయంలో సాయిరెడ్డి మద్యం సేవించి ఉన్నాడని, హత్యలో ఇంకా ఒకరిద్దరి పాత్ర ఉండి ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నలుగురికి న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో తొమ్మిది మందికి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ కౌన్సెలింగ్ ఇచ్చి మార్నింగ్ కోర్టులో హాజరుపరిచారన్నారు. న్యాయమూర్తి సయ్యద్ ఖదీర్ ఐదుగురికి రూ.5వేల జరిమానా విధించారని, మరో నలుగురిలో ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్ష, ఇద్దరికి రెండు రోజుల చొప్పున, మరొకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు వివరించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఏసీపీ సూచించారు.

మాక్లూర్ మండలానికి చెందిన ఇద్దరికి..

మాక్లూర్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో మండలానికి చెందిన ఇద్దరికి న్యాయమూర్తి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సుధీర్‌రావు శుక్రవారం తెలిపారు. ఈనెల 25న మానిక్‌బండార్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, గుత్పతండా, మానిక్ బండార్‌కు చెందిన ఇద్దరు పట్టుబడ్డారన్నారు. ఇరువురిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

తొమ్మిది మంది రిమాండ్

సిరికొండ: మండలంలోని గడ్కోల్‌కు చెందిన గుర్రాల రవీందర్ ఆత్మహత్యకు కారణమైన తొమ్మిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమేశ్ శుక్రవారం తెలిపారు. ఇద్దరిని గురువారం, ఏడుగురిని శుక్రవారం రిమాండ్‌కు తరలించామన్నారు.

3.5 కిలోల గంజాయి స్వాధీనం

కామారెడ్డి క్రైం: నిజామాబాద్ నుంచి తీసుకువచ్చిన గంజాయి కామారెడ్డిలో ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్న ఓ ముఠాను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రాజు వివరాలు వెల్లడించారు. నిజాంసాగర్ చౌరస్తాలోని ఓ టీపాయింట్ వద్ద గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం దాడి చేసి స్వామి అనే వ్యక్తి నుంచి 70 గ్రాములు గంజాయిని స్వాధీని చేసుకొని విచారించారు. నిజామాబాద్‌లోని ఆటోనగర్‌కు చెందిన ఫరీదా బేగం నుంచి తాను గంజాయి తీసుకువచ్చినట్లు స్వామి తెలుపడంతో ఆటోనగర్‌కు వెళ్లి సదరు మహిళ ఇంట్లో సోదాలు నిర్వహించి 3.48 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, దాడుల్లో ఏఈఎస్ హన్మంత్‌రావు, సీఐ విజయ్‌కుమార్, ఎస్సై విక్రమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

వ్యాన్ బోల్తా.. ఇద్దరి మృత్యువాత

- మరో 15 మందికి గాయాలు
- బడాపహాడ్ దర్గాకు వెళ్తుండగా ప్రమాదం



శ్యాంసుందర్(ఫైల్)



వసంత(ఫైల్)



బాధితురాలిని పరామర్శిస్తున్న ప్రశాంత్‌రెడ్డి



పరామర్శిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్..

నిజామాబాద్ రూరల్: మొక్కు చెల్లించుకునేందుకు దర్గా వద్దకు వెళ్తుండగా జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. మరో 15 మంది గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన రెంజర్ల స్వామి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులతో కలిసి గురువారం రాత్రి తొమ్మిది గంటలకు ఐచర్ వ్యాన్‌లో వర్ని మండలంలోని బడాపహాడ్ దర్గాకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్ గ్రామ శివారులో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో రెంజర్ల వసంత(30), రెంజర్ల శ్యాంసుందర్(48) అక్కడికక్కడే మృతి చెందారు. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న మరో 15 మందికి గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరు మహిళల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రితోపాటు మరో రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఎంపీ అర్వింద్, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, ఎంపీ అభ్యర్థులు బాజిరెడ్డి గోవర్ధన్(బీఆర్ఎస్), జీవన్‌రెడ్డి(కాంగ్రెస్) బాధితులను శుక్రవారం పరామర్శించారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగంగా వాహనాన్ని నడపడం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐచర్ వ్యాన్ డ్రైవర్ కృష్ణపై కేసు నమోదు చేశామని నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో చైతన్యరెడ్డి తెలిపారు.

రెండిళ్లకు పెద్ద దిక్కు శ్యాంసుందర్

కమ్మర్‌పల్లి: వ్యాన్ బోల్తాపడిన ఘటనలో మృతి చెందిన రెంజర్ల శ్యాంసుందర్ రెండు కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉన్నాడు. మండల కేంద్రానికి చెందిన శ్యాంసుందర్ 19ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన ఏనుగు అంజయ్య కూతురు భారతిని వివాహం చేసుకొని ఇల్లరికం వెళ్లాడు. శ్యామ్‌సుందర్ తండ్రి రెంజర్ల చిన్న నర్సయ్య 12ఏళ్ల క్రితం, మామ అంజయ్య కొన్నేళ్ల క్రితం కొవిడ్‌తో మరణించారు. దీంతో అటు తన కుటుంబ బాధ్యతలతోపాటు ఇటు అత్తవారింటి బాధ్యతలను శ్యాంసుందర్ చూసుకుంటున్నాడు. పెద్దదిక్కైన శ్యాంసుందర్ మృతితో రెండు కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి.

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

- అధిక ఉష్ణోగ్రత కారణంగా పేలిన గ్యాస్ సిలిండర్
- వేగంగా వ్యాపించిన మంటలు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్ గ్రామంలో ఉన్న వేంకటేశ్వర రైస్‌మిల్లులో శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పెరిగిన ఉష్ణోగ్రత కారణంగా రైస్‌మిల్లులోని స్టోర్‌రూం (రేకుల షెడ్డు)లో ఉంచిన గ్యాస్‌సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయి. స్టోర్ రూంలో గన్నీ సంచులు, ఆయిల్‌తోపాటు ఇతర వస్తువులు ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించి పొగలు కమ్ముకున్నాయి. రేకులు ఎగిరిపడ్డాయి, హమాలీలు వెంటనే స్పందించి ఇసుక, నీళ్లు చల్లి మంటలార్పే ప్రయత్నం చేస్తుండగా ఘటనాస్థలానికి ఫైర్‌ఇంజిన్ చేరుకుంది. మంటలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది తగిన చర్యలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న సీఐ కృష్ణ ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకోకముందే ఉన్నతాధికారులు స్పందించి నివాస ప్రాంతాల్లోని పరిశ్రమలను శివారు ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విలేజ్ పార్క్ వద్ద..

వర్ని: మండలంలోని సత్యనారాయణపురం విలేజ్ పార్క్ వద్ద శుక్రవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. అప్రమత్తమైన గ్రామ పంచాయతీ కార్యదర్శి.. సిబ్బంది సహకారంతో మంటలను ఆర్పివేశారు. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి పారేయడంతో మంటలు అంటుకున్నట్లు కార్యదర్శి సాయిలు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో బీడీలు, సిగరెట్లను కాల్చి పారేయొద్దని సూచించారు.


బైక్‌ను ఢీకొన్న ఆటో

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా కందర్‌పల్లి రోడ్డులో శుక్రవారం బైక్‌ను ట్రాలీఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో శివప్రసాద్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ మద్యం సేవించి అతివేగం, అజాగ్రత్తగా ఆటో నడిపి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీ వెనుక చక్రాల్లోకి దూసుకెళ్లింది. లారీ డ్రైవర్ గమనించి వెంటనే బ్రేకులు వేయడంతో ప్రమాదం తప్పింది. శివప్రసాద్ ప్రాణాలతో బయటపడినప్పటికీ.. తల, ముఖానికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. మద్యం సేవించిన ఆటోడ్రైవర్‌ను స్థానికులు పోలీసులకు అప్పగించారు.

పరిస్థితి విషమించి ఒకరి మృతి

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దోమకొండ మండలం సంగమేశ్వర గ్రామానికి చెందిన పరశురాములు (35)కు ఏడాదాది క్రితం భార్య విడాకులు ఇచ్చింది. అప్పటినుంచి ఆయన సరిగా ఇంటికి వెళ్లకుండా గ్రామాల్లో తిరుగుతున్నాడు. ఈ క్రమంలో గురువారం జంగంపల్లి బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం పరశురాములును ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరశురాములు ఫొటోతో సమాచారాన్ని అన్ని వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. సమాచారం తెలియడంతో కుటుంబ సభ్యులు వెంటనే కామారెడ్డికి వెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు పరశురాములు నిజామాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నడిపల్లి తండాకు చెందిన యువకుడు..



డిచ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయాలపాలైన మండలంలోని నడిపల్లితండాకు చెందిన బట్టు సతీశ్(28) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై యూ.మహేశ్ తెలిపారు. ఈ నెల 20న రాత్రి సమయంలో సతీశ్ తన అన్న బట్టు సురేశ్‌తో కలిసి డిచ్‌పల్లిలోని ఆస్పత్రికి వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అన్నాదమ్ముళ్లిదరికీ గాయాలయ్యాయి. మృతుడికి భార్య స్వప్న, ఆరు నెలల పాప ఉన్నారు. సతీశ్ మృతి చెందడం, సురేశ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో నడిపల్లి తండాల్లో విషాదం నెలకొంది.

బ్యాటరీలు, టైర్లు చోరీ

భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ఉన్న నందిని రెడీమిక్స్ ప్లాంట్‌లో టైర్లు, బ్యాటరీలు చోరీ అయినట్లు ప్లాంట్ యజమాని గంధ్ర మధుసూదన్ రావు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి ప్లాంట్ ఆవరణలో నాలుగు లారీలు నిలిపి ఉంచగా, రెండు లారీల బ్యాటరీలతోపాటు మరో రెండు లారీల టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.